

కడప- చెన్నై రహదారిపై లారీ దగ్ధం

- మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి - సిద్ధవటం (ఒంటిమిట్ట)

కడప - చెన్నై జాతీయ రహదారిపై లారీ ఇసుక లోడుతో ముద్దనూరు నుంచి చెన్నైకి బయలు దేరింది. మాధవరం1 వద్దకు రాగానే ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. వెంటనే డ్రైవర్, క్లీనర్ అప్రమత్తమై లారీ దిగారు. విషయం తెలుసుకున్న ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణంరాజు నాయక్, ఎస్ఐ చిరంజీవి చేరుకుని ప్రమాదకటనపై విచారిస్తున్నారు. ఈ ఘటనతో జాతీయ రహదారిపై రెండు కిలోమీటర్ల వాహనాలు పూర్తిగా నిలిచిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. డ్రైవర్ ప్రసాద్ తెలిపిన సమాచారం మేరకు పోలీసులు విచారిస్తున్నారు.



మంటల్లో కాలుతున్న లారీ

నామినేటెడ్ ఆశలు!

దసరాలోపు నియమించే అవకాశాలు
టిడిపి కేడర్‌లో ఉత్సాహం



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

2019 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు అనుకూలముగా రావడంతో వైసిపి కేడర్ సాగించిన భౌతిక, ఆర్థిక, దాడుల్లో 82 మంది టిడిపి కార్యకర్తలపై అరాచకం రాజ్యమేలిన సంగతి తెలిసిందే. ఒంటిమిట్ట మండలం నడింపల్లికి చెందిన గజ్జుటూరి మౌలాలి మొదటి వరుసలో ఉన్నారనడంలో సందేహం లేదు. 2019 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు పూర్తిగా వెలువడక ముందే రాష్ట్రంలోనే మొదటగా ఈయన ఇంటి ముంగిట పటాసులు పేల్చడాన్ని ప్రస్తావించిన పాపానికి కర్రలు, రాళ్లతో తీవ్రంగా గాయ పరిచిన ఘటనలో అపస్మారక స్థితిలోకి పోయిన సంగతి తెలిసిందే. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందలాది టిడిపి కార్యకర్తలపై పెద్దఎత్తున దాడులు చోటుచేసుకోవడం గమనార్హం. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో టిడిపి అధ్యక్షులు చంద్రబాబు 2019 డిసెంబర్‌లో కడప నగర శివారులోని ఓ ఫంక్షన్ హాలులో బాధితులందరినీ సమీకరించి వారిలో ధైర్యాన్ని నూరిపోసిన సందర్భంలో దాడుల్లో గాయపడిన, నష్టపోయిన బాధితులందరికీ ఆర్థిక, న్యాయ, నామినేషన్ పదవుల కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అధికారంలో వచ్చిన వెంటనే టిడిపి అధ్యక్షులు చంద్రబాబు బాధిత కార్యకర్తల సంరక్షణకు ఉద్దేశించి కమిటీ వేసి గ్రీవెన్స్ పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చి 100 రోజులు గడిచినప్పటికీ ఎటువంటి సహకారం అందిన దాఖలాల్లేవు. ఆర్థిక సహకారం, నామినేటెడ్ పోస్టుల భర్తీలో ప్రాధాన్యతపై ఇచ్చిన హామీని అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందనే వాదన వినిపిస్తోంది. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో ఆయనను ధిక్కరించి, నిరసనలు, ధర్నాలకు దిగిన బడుగు, బలహీన వర్గాలకు చెందిన కార్యకర్తలకు కేటగిరీలకు అతీతమైన పదవులు కట్టబెట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది.

జిల్లాలోని తెలుగు తమ్ముళ్లలో నామినేటెడ్ ఆశల కోలాహలం నెలకొంది. రాష్ట్రంలో వరద విలయం ముగిసిన నేపథ్యంలో దసరా పండుగ లోపు నామినేటెడ్ పోస్టుల భర్తీకి ముందుకెళ్లే అవకాశాలు ఉన్నాయనే సంకేతాల నేపథ్యంలో టిడిపి కేడర్‌లో ఉత్సాహం నెలకొంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అధ్యక్షులు చంద్రబాబు నేతృత్వంలో అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీలకు నామినేటెడ్ పోస్టుల పంపిణీకి ఓ ఫార్ములాను రూపొందించిన సంగతి తెలిసిందే. కూటమి పార్టీలకు పోగా మిగిలిన పోస్టుల భర్తీ ప్రక్రియలో వైసిపి శ్రేణుల బారిన పడి తీవ్రంగా గాయపడిన సంఘటనల్లో ప్రాణాలతో మిగిలిన కేడర్‌ను గుర్తించి నామినేటెడ్ పదవులు ఇవ్వనున్నారా, నియోజకవర్గ ఇన్‌ఛార్జిల సిఫారసు లెటర్ల ఆధారంగా ఇస్తుందా అనే చర్చ నడుస్తోంది. ఇన్‌ఛార్జిల లెటర్లు ఆధారంగా నామినేటెడ్ పోస్టులు ఇస్తే పార్టీ కోసం ప్రాణాలొడ్డిన కార్యకర్తలకు అన్యాయం చేసినట్లు అవుతుందనే వాదన బలంగా వినిపిస్తోంది. నియోజకవర్గ, పార్లమెంట్ ఇన్‌ఛార్జిలు ఒకటి, రెండు అధిపత్య కుల, సామాజిక తరగతులకు చెందిన కార్యకర్తలను మాత్రమే సిఫారసు లెటర్లు ఇచ్చే అవకాశాలు ఉన్నాయని వాదన వినిపిస్తోంది. వైసిపి బారిన పడి తీవ్రంగా నష్టపోయిన కార్యకర్తల డేటా స్వీకరణ, మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా, రాష్ట్ర నాయకత్వం స్వతంత్ర ఏజెన్సీలు, వేగుల ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా ముందుకెళ్తే కొంత మేరకు ప్రయోజనం నెరవేరే అవకాశం ఉందనే వాదన వినిపిస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ఇప్పటికే నామినేటెడ్ పోస్టుల జాబితాను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

కూటమి పార్టీలకు నామినేటెడ్ పోస్టుల భర్తీలో భాగస్వామ్యం ఇవ్వడంతో టిడిపి గణనీయంగా నష్టపోనుంది. టిడిపి ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాల్లో 30 శాతం జనసేన, 10 శాతం బిజెపి కార్యకర్తలకు, బిజెపి ఎమ్మెల్యే ఉన్న స్థానాల్లో టిడిపికి 50 శాతం, బిజెపి, జనసేనలకు 50 శాతం నామినేటెడ్ పోస్టులు కేటాయిస్తే అప్పట్లో వైసిపి బారిన పడిన తమ పరిస్థితి ఏమిటనే చర్చ నడుస్తోంది. అప్పట్లో జనసేన, బిజెపి కార్యకర్తలు ఎలాంటి కష్టనష్టాలను ఎదుర్కోలేదనే విషయాన్ని ప్రస్తావిస్తుండడం గమనార్హం. రాష్ట్రంలో జనసేన, బిజె పి ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో టిడిపి కార్యకర్తలు తీవ్రంగా నష్టపోనున్నట్లు తెలుస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో టిడిపి అధ్యక్షులు నామినేటెడ్ పోస్టుల భర్తీలో కడప జిల్లాలోని కడప, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, అన్నమయ్య జిల్లాలోని రాజంపేట, రైల్వేకోడూరు టికెట్లు త్యాగం చేసిన సీనియర్లకు ప్రాధాన్యత ఇస్తారా, వైఎస్ జగన్ సొంత జిల్లాలోని బలమైన వైసిపి కేడర్ దాడుల బారిన పడిన టిడిపి కార్యకర్తలకు ఎవరికి ఏమేరకు న్యాయం చేస్తారో అనేది వేచి చూడాల్సి ఉంది.

త్వరలో రూ.15 వేల కోట్లతో రోడ్లు

- రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



చిన్నమండెం : సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లె

త్వరలో రూ.15 వేల కోట్లు వెచ్చించి రోడ్ల నిర్మాణాలు పూర్తి చేస్తామని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. కడప నుంచి రాయచోటి వరకు నాలుగు లైన్ల రహదారి ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. సోమవారం లకిరెడ్డిపల్లి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన టిడిపి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ గువ్వల చెరువు ఘాట్ రోడ్డు శాశ్వత పరిష్కారానికి సొరంగ మార్గం మంజూరుకు కేంద్ర మంత్రి నితిన్ గట్కరిగా కృషి చేశారన్నారు. గతంలో ఏ మంత్రి చేయని విధంగా ప్రభుత్వం ఏర్పడిన 90 రోజులకే అవసరాన్ని బట్టి రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని వేల నూతన బస్సులను ప్రారంభించి రవాణా శాఖకు ఒక గుర్తింపు తీసుకువచ్చానన్నారు. రాబోయే ఐదేళ్లలో ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజలకు మరింత చేరువవుతానన్నారు. రాబోయే రోజుల్లో 5000 వేల ఆర్టీసీ నూతన బస్సులు ప్రారంభిస్తామని చెప్పారు. రాయచోటి నియోజకవర్గం అభివృద్ధే తమ ధ్యేయంగా ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ప్రజల రుణాన్ని తీర్చుకుంటానన్నారు. గత ప్రభుత్వంలో పేదల భూములు లాక్కోవడం, భూములను ఆన్‌లైన్ నుంచి తొలగించడం, కొట్టడం, తిట్టడం వంటి అనేక సంఘటనలు జరిగాయని అవన్నీ దృష్టిలో ఉంచుకొని నేడు అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళుతున్నానన్నారు. నియోజకవర్గంలో శాశ్వత నీటి సమస్య పరిష్కరించేందుకు 56 నూతన బోర్లు వేసి మంచినీటి సమస్య పరిష్కరించామన్నారు. టిడిపి కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయం నుంచి నూతన టిడిపి కార్యాలయం వరకు భారీ జన సందోహం మధ్య ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ లక్కిరెడ్డిపల్లె పట్టణంలోని మూడు రోడ్ల సర్కిల్‌కు చేరుకోగానే టిడిపి నాయకులు మంత్రికి గజమాలవేసి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి, టిడిపి యువ నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మదన్, లక్కిరెడ్డిపల్లి మండల అధ్యక్షులు జయరాం, మాజీ జడ్‌పిటిసి రెడ్డయ్య యాదవ్, ఎర్రగుడి చంద్రశేఖర్, రాయచోటి నియోజకవర్గంలోని రాయచోటి, సంబేపల్లి, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, చిన్నమండెం మండలాల టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రజలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

చిన్నమండెం : జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బోరెడ్డిగారిపల్లెలో ఉన్న తమ నివాసంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ఒక్కరు సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం 'ప్రజాదర్బార్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వచ్చే సమస్యలన్నీ ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు తెలియజేసి తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి ప్రజాదర్బార్ కార్యక్రమానికి ప్రజలు విశేష సంఖ్యలో హాజరయ్యారు.

మౌలిక వసతులు ఏర్పాటు చేస్తాం

రాయచోటి : పట్టణంలోని ఆనంద నిలయ స్వగృహ కాలనీలో అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆనంద నిలయ స్వగృహ కాలనీలో విస్తృతంగా పర్యటించి మాట్లాడుతూ ఆనంద నిలయ స్వగృహ కాలనీలోని ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. కాలనీలో ముఖ్యంగా రోడ్లు, డ్రెయినేజీ, కరెంటు, వీధిలైట్లు వంటి సమస్యలను పరిష్కరించి కాలనీని సుందరంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతి కాలనీ, ప్రతి గ్రామంలో శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఆనంద నిలయ స్వగృహ కాలనీ ప్రజలు మంత్రి పలు సమస్యలపై అర్జీలు సమర్పించారు. సమస్యలన్నీ వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

నమాస్ గిరి దర్గాలో 'మండిపల్లి' ప్రార్థనలు

పట్టణంలోని అత్యంత ప్రసిద్ధి చెందిన నమాస్ గిరి దర్గాలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ముస్లిం సోదరులందరికీ మిలాద్-నబి-శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

నేటి నుంచి స్వచ్ఛతా హీ సేవలు : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

'స్వభావ్ స్వచ్ఛత-సంస్కార్ స్వచ్ఛత' అనే ఇతి వృత్తంతో 'స్వచ్ఛ తాహి సేవ-2024' కార్యక్రమాన్ని జిల్లాలో ఈ నెల 17 నుండి అక్టోబర్ 2 వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో స్వచ్ఛభారత్ మిషన్‌ను ప్రారంభించి 10 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా స్వచ్ఛతా హీ సేవ పరిశుభ్రత కార్యక్రమాలు, అక్టోబర్ 2న స్వచ్ఛభారత్ దివస్‌ను నిర్వహిస్తామన్నారు. జిల్లాలో పటిష్టంగా అమలు చేసేందుకు జిల్లా స్థాయిలో 15 మంది అధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలు, బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించడం, వాటిని అక్టోబర్ 1లోగా ఆయా గ్రామాలలోని యువత, స్వయం సహాయక సంఘాలు, పాఠశాల, కళాశాలల విద్యార్థులు, రైతులు, స్వచ్ఛంద సంస్థలు తదితరులతో కూడిన ప్రజా సమూహం సహాయంతో శ్రమదానం ద్వారా శుభ్రం చేయిస్తామన్నారు. అక్టోబర్ 2న జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న వారికి అవార్డులు, సఫాయి మిత్రలకు సన్మానం ఉంటాయన్నారు. మొదటగా జిల్లాలో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలు, బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి సంబంధిత వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లా స్థాయి లో, మండల స్థాయిలో ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రారంభమ వుతుందని, 17న మానవ హారం (హ్యూమన్ చైన్), 18న మొక్క లు నాటే కార్యక్రమం, 19న స్వచ్ఛత హి సేవ కార్యక్రమం గురించి ఇంటింటికి తిరిగి ప్రచారం చేయడం, 20న పాఠశాల స్థాయిలో "స్వభావ్ స్వచ్ఛత-సంస్కార్ స్వచ్ఛత" గురించి సాంస్కృతిక కార్యక్రమాలు, 21న క్విజ్, వ్యాసరచన పోటీలు, 22 న ఈ కార్యక్రమ ఫోటోలు, వీడియోలను సోషల్ మీడియా, డిజిటల్ మీడియాలో అప్లోడ్ చేసి మరింతమందికి అవగాహన కలుగజేయడం, 23న వేస్ట్ ఆర్ట్ ఎగ్జిబిషన్ నిర్వహణ, 24న గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించడం, 25న సఫాయి కార్మికులకు అందు తున్న సేవల గురించి సర్వే చేయడం, 26న సఫాయి మిత్రలకు వైద్య శిబిరాలు నిర్వహించడం, 2వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజు పెద్ద ఎత్తున ప్రజలందరి భాగస్వామ్యంతో శ్రమదానం ద్వారా అపరిశుభ్ర ప్రాంతాలను పరిశుభ్రపరచే సంపూర్ణ స్వచ్ఛత కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.



గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య బృందం

వ్యాధుల ఉధృతి నివారణకు చర్యలు

- మలేరియా సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్

ప్రజాశక్తి-పీలేరు

తేలికపాటి నివారణ చర్యలతో అంటు వ్యాధుల అదుపు సాధ్యమని మలేరియా సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్, హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య తెలిపారు. సోమవారం పీలేరు మండలం, గూడరేవుపల్లి పంచాయితీ, రామానాయక్ తాండాలో ప్రజలకు "అవగాహనతో అంటు వ్యాధుల అదుపు" అనే అంశముపై అవగాహ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య సూచనలిస్తూ దోమ కాటు ఆరోగ్యానికి చేటు అని, ప్రతి ఒక్కరి మెరుగైన ఆరోగ్యం కోసం గ ృహాల్లో ఆహర పదార్థాలపై దుమ్ము, దూళి పడకుండా, ఈగలు వాలకుండా మూతలు పెట్టాలని, చెత్త చెదారాన్ని పెంటను, విచ్చలవిడిగా పారవేయకుండా నివాసానికి దూరంగా గోతిలో వేసి మన్నుకాప్పాలని, వ్యక్తిగత మరుగుదొడ్లను వందశాతం శాస్త్రీయంగా వినియోగించాలని, నీటిని 20 నిమిషాలు మరగబెట్టి చల్లార్చి త్రాగలని, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత, చేతులు శుభ్రత విధిగా పాటించాలని లేనిచి వ్యర్థాలతో కూడిన,మరియు ఈగలు వాలిన ఆహారపదార్థాలను, కలుషిత నీటిని త్రాగుటవల్ల అతిసార,పచ్చ కామెర్లు,టైపాయిడ్,కలరా,మొదలగు అనేక వ్యాధులు విజ ృంభించే అవకాశం ఉందని కావున వ్యాధులు ఎలా వస్తాయి, ఎలా రావు అనే ప్రాథమిక సమాచారం ప్రతి ఒక్కరికి అవసరమని హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, గ్రామీణులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్, హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, యంపిహెచ్ఇఓ శ్రీనివాసులు, ఆశ కార్యకర్త అనిత ప్రజలు పాల్గొన్నారు.

'గంగనపల్లి'కి సత్కారం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణానికి చెందిన తెలుగు పండితులు, కవి గంగనపల్లి వెంకటరమణ తెలుగు భాషా వికాసాలకై చేస్తున్న కృషికి గుర్తింపుగా సోమవారం బద్వేలులో జరిగిన కార్యక్రమంలో ఘన సన్మానం అందుకున్నారు. మొల్ల సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు జయంతి ఉత్సవాలు బద్వేలు పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశ మందిరంలో ఘనంగా జరిగాయి. తెలుగు ఉపాధ్యాయులుగా, కవిగా, తెలుగు భాషా సంరక్షణ సమితి బాధ్యులుగా, భాషా వికాసాలకై గంగనపల్లి వెంకటరమణ చేస్తున్న కృషిని అభినందిస్తూ నిర్వాహకులు ఆయనను శాలువా, పూలమాల, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, నెల్లూరు పట్టణానికి చెందిన తిక్కన మహాకవి లలిత కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు ఆలూరు శిరోమణి శర్మ, రాయచోటికి చెందిన ప్రముఖ అవధాని లోకా జగన్నాథ శాస్త్రి, దేవీ ఉపాసకులు మాడుగుల శివ శ్రీశర్మ పాల్గొన్నారు.



గంగనపల్లి వెంకటరమణను సన్మానిస్తున్న కవి పండితులు

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ బి.సునీల్ తెలిపారు. ఆదివారం కడపలో జరిగిన రాష్ట్ర స్థాయి తేక్వాండో పోటీలలో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తూ సోమవారం మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో రాజంపేట ప్రెస్ క్లబ్ ప్రతినిధుల ద్వారా పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ తమ అకాడమీ నుంచి 14 మంది క్రీడాకారులు పోటీలో పాల్గొని పతకాలు సాధించినట్లు తెలిపారు. సబ్ జూనియర్ విభాగంలో ఎం.ప్రతీక్, వై.దక్షిత, కె.లేఖ్య, కె.పునీత్ జూనియర్ విభాగంలో బి.గౌతమ్, ఎం.రితేస్ స్వర్ణ పతకాలు సాధించారని, టి.కోమల్, వాఫిక్, యువన్ సాయి కృష్ణ, సాయి సాత్విక్ రజతం, కె.బాలాజీ, కె.లాలిత్య హలర్ కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. తేక్వాండో సాధనతో ఆరోగ్యంతో పాటు ఆత్మరక్షణ, విద్యా, ఉద్యోగాలలో మెరుగైన అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి చౌడవరం నరసింహ, కోచ్‌లు చంద్రశేఖర్, గంగారాం, కె.నాగరాజ, ప్రముఖ ఆంగ్లభాష బోధకుడు యానాది, గణిత ఉపాధ్యాయులు హరి పాల్గొన్నారు.

ముంపు కాలనీలను సుందరంగా తీర్చిదిద్దుతాం : మంత్రి



మహిళకు ఇంటి పట్టా అందజేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి


ప్రజాశక్తి-ఓబులవారిపల్లె (పుల్లంపేట)

మంగంపేట ముంపు బాధితులకు కేటాయించిన అర్అర్-5 లేఅవుట్ అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఓబులవారిపల్లి మండలంలోని మంగంపేట గ్రామ పంచాయతీ కాపువల్లి, అరుంధతి వాడ, హరిజనవాడ ముంపు బాధితులకు కేటాయించిన ఆర్ఆర్-5, లేఅవుట్‌లో మంత్రి, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌తో కలిసి లబ్ధిదారులకు ఇంటి పట్టాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముంపు బాధితులకు ప్రభుత్వ పరంగా పూర్తి సహాయ సహకారాలు అందించి ఆదుకుంటామని తెలిపారు. కాపువల్లి, అరుంద తివాడ, హరిజనవాడ గ్రామస్తుల కోరిక మేరకు లేఅవుట్లో అన్ని మౌలిక వసతులు కల్పించి సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. సిసి రోడ్లు, డ్రెయినేజీ, స్కూల్ బిల్డింగ్, విద్యుత్, క్రీడా మైదానం, శ్మశానవాటిక, పార్క్ తదితర మౌలిక వసతులన్నీ లేఅవుట్‌లో కల్పిస్తున్నామన్నారు. కాలనీలో విశాలమైన రోడ్లు ఉన్నాయని రోడ్డు కిరువైపులా గ్రీనరీ ఏర్పాటు చేయాలని అధికారులకు తెలిపారు. ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్ మాట్లాడుతూ కాపువల్లి, అరుందతివాడ, హరిజనవాడ గ్రామాలను ఆహ్లాదకరమైన వాతావరణం కలిగి సురక్షితమైన ప్రాంతాలకు తరలించడం ప్రతి ఒక్కరూ గమనించదగ్గ విషయమన్నారు. లేఔట్‌లో ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించడం అవుతుందన్నారు. అనంతరం మంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు ఇంటి పట్టాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, రాజంపేట సబ్ కలెక్టర్ నదియాదేవి, తహశీల్దార్ పేరుమున్ని, రైల్వేకోడూరు టిడిపి ఇన్‌ఛార్జి రూపానంద్, ఏపిఎస్‌పిడిసిఎల్, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

'మిట్స్'లో ఘనంగా ఓజోన్ దినోత్సవం

ప్రజాశక్తి-మదనపల్లి

మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కళాశాల సలహాదారు డాక్టర్ తులసీరామ్ నాయుడు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని ఓజోన్ పొర పరిరక్షణ కోసం అంతర్జాతీయ దినోత్సవాన్ని సెప్టెంబర్ 16న జరుపుకుంటామని పేర్కొన్నారు. ఓజోన్ పొర క్రమంగా క్షీణిస్తోందని, దానిని సంరక్షించేందుకు మనం కొన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని మనం జరుపుకోవాలన్నారు. ఈ రోజుల్లో మనం తీసుకునే ప్రతీ నిర్ణయమూ ఓజోన్ పొరను దెబ్బతీస్తోందని చెప్పారు. భూతాపం పెరిగినా, వానలు కురవకపోయినా, అడవులు తగ్గి పోయినా, కాలుష్యం ఎక్కువైనా ఇలాంటి అనర్థాలన్నీ ఓజోన్ పొరను దెబ్బతీసేవేనని పేర్కొన్నారు. పాలపై మీగడలా ఈ ఓజోన్ అనే వాయువు భూమి చుట్టూ ఓ పొరలా అల్లుకొని ఉందని ఇది భూమి నుంచీ స్ట్రాటో ఆవరణంలో 15 నుంచి 50 కిలోమీటర్ల మందంలో విస్తరించి ఉందన్నారు. సూర్యుడి నుంచి వచ్చే అతి నీలలోహిత కిరణాలు డైరెక్టుగా భూమిపై పడనివ్వకుండా ఓజోన్ పొర అడ్డుకుంటోందని పేర్కొన్నారు. దీని ఫలితంగా భగభగ మండే కిరణాలు మనపై పడకుండా ఉంటున్నాయని తెలిపారు. ఆ పొరే గనక లేకపోతే ఆ కిరణాలు డైరెక్టుగా భూమిపై పడి మొత్తం ప్రాణికోటి చనిపోయేదేనన్నారు. ఓజోన్ పొరను దెబ్బతీస్తున్న స్ప్రేలు, పొలాల్లో చల్లుతున్న ఎరువులు, క్రిమి సంహారాలు, ఫ్రిజ్‌లు, కార్లపై వేస్తున్న కలర్స్, క్లోరో ఫ్లోరో కార్బన్ల వంటి వాటి వాడకాన్ని ఆపేయాలని 1987లోనే నిర్ణయం తీసుకున్నా అమలవ్వట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా ఓజోన్ పొర దెబ్బతింటూనే ఉందన్నారు. ప్రతి ఒక్కరు దీనిపై అవగహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కెమిస్ట్రీ విభాగాధిపతి రంజిత్ భాస్కరన్, ఫస్ట్ ఇయర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ చంద్ర మోహన్, డాక్టర్ రష్మీ రాయ్ పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లు ఇస్తున్న తులసిరామ్ నాయుడు



ఫయాజ్‌బాషాను పరామర్శిస్తున్న వైసిపి నాయకులు గడికోట, ఆకేపాటి

మున్సిపల్ చైర్మన్ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - రాయచోటిటౌన్

రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాష తండ్రి ఇలియాస్‌బాష అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం మున్సిపల్ చైర్మన్ కుటుంబాన్ని వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమరనాథరెడ్డి పరామర్శించారు. ఇలియాస్ బాష మృతి పట్ల వారు సంతాపం తెలిపారు. ఫయాజ్‌బాషాను ఓదార్చారు. వారి వెంట మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొలిమి హారూన్, కొలిమి చాన్‌బాష, జాకీర్ హుసేన్, ఫయాజ్ అహమ్మద్, చిన్నగొల్లపల్లె సర్పంచ్ జయచంద్ర, సుగవాసి శ్యామ్, గౌస్‌ఖాన్, రియాజ్, అన్నా సలీం, అబుజర్, ఉమర్, కొత్తిమీర ప్రసాద్, జబిఉల్లా, అష్రఫ్, నియామత్, బేపారి అసద్, జమాల్ ఉన్నారు.

ఎస్‌సి వర్గీకరణ జోలికొస్తే బుద్ధి చెబుతాం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎస్‌సి వర్గీకరణ జోలికొస్తే టిడిపి, బిజెపిలకు బుద్ధి చెబుతామని రాయలసీమ మాలమహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ళ అరుణ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం కడప ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఏడుగురు జడ్జీలతో కూడిన కమిటీ ఇచ్చిన తీర్పును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. బిజెపి ప్రభుత్వం నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో ఎస్‌సి రిజర్వేషన్ల ఎత్తి వేయడానికి కుట్ర పూరితంగా పన్నుతోందని మండిపడ్డారు. జనాభా ప్రాతిపదికన ఎస్‌సి రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. 2014లో ఎస్‌సి వర్గీకరణ జోలికి రావడం వల్లే టిడిపి ప్రభుత్వం అధికారం కోల్పోయిందని విమర్శించారు. ఆర్టికల్ 341 ప్రకారం సవరణ చేయకుండా విభజించే హక్కు ఎవరికీ లేదన్నారు. ఎస్‌సి వర్గీకరణ విషయంలో ఏక పక్ష నిర్ణయం తీసుకుంటే న్యాయ వ్యవస్థ మీద ప్రజల్లో విశ్వాసం కోల్పోతుందని పేర్కొన్నారు. ఎస్‌సి వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, అలా చేయడం కుదరదని సుప్రీంకోర్టు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఎస్‌సి వర్గీకరణకు ఏ పార్టీ మద్దతు తెలిపినా ఆ పార్టీకి బుద్ధి చెబుతామన్నారు. రాయలసీమ ఇన్‌ఛార్జి మిట్టా సునీత కుమారి మాట్లాడుతూ గతంలో మాల మాదిగలు టిడిపికి మద్దతు తెలిపి గెలిపించారని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి సాతిరి లక్ష్మయ్య, జిల్లా అధ్యక్షులు నర్రా వెంకట సుబ్బయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మొలక గోపాల్, జిల్లా ఆర్గనైజర్ పందిటి రవికుమార్ పాల్గొన్నారు.

వైభవంగా వినాయకుడి నిమజ్జనం


వినాయక నిమజ్జనంలో పాల్గొన్న ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ కాపు వీధి వద్ద నాగిరెడ్డిపల్లె యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ వరసిద్ధి వినాయకస్వామి నిమజ్జన కార్యక్రమానికి సోమ వారం ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వినాయకస్వామి నిమజ్జన కార్యక్రమాన్ని టెంకాయ కొట్టి నిమజ్జన రథాన్ని కదిలించారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యులు కలిముల్లా ఖాన్, మహిళా అధ్యక్షురాలు పల్లె మాధవి, గుండ్లూరు మాజీ వాటర్ బోర్డు మెంబర్ వేణుగోపాల్‌రెడ్డి, వైసిపి నాయకులు గంగిరెడ్డి, తుమ్మల శ్రీధర్‌గౌడ్, పెనుబాల నాగసుబ్బయ్య, విజయుడు, గంగిరెడ్డి, అది నారాయణ, కవిత, దేవి పాల్గొన్నారు.

రూ.36 వేలు పలికిన లడ్డూ


లడ్డూను దక్కించుకున్న ప్రదీప్‌కుమార్

మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ రెడ్డివారివీధి వద్ద ఏర్పాటుచేసిన వినాయకస్వామి లడ్డూ వేలం పాటలో ప్రదీప్‌కుమార్(పత్తి) రూ.36 వేల రూపాయలు పాడి లడ్డూ దక్కించుకున్నారు. అనంతరం వినాయకుడి నిమ జ్జనాన్ని డప్పు వాయిద్యాలతో కోలాహలంగా, కేరింతల మధ్య నిమజ్జనం చేశారు. కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

తంబళ్లపల్లి నియోజకవర్గం,బి.కొత్తకోట పట్టణంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మతపెద్దలతో కలిసి ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొ న్నారు. స్థానిక చౌక్ మజీద్ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం చౌక్ మస్జిద్ ప్రారంభమై బైపాస్ రోడ్డు రంగసముద్రం రోడ్డు, బెంగళూరు రోడ్డు, స్థానిక జామియా మజీద్ దర్గా వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీలో ప్రవక్త నినాదాలతో పాటు మిఠాయిలు పంచుతూ వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం, మానవాళికి విలువైన సందేశాలు ఇచ్చిన మహోన్నత వ్యక్తి మహమ్మద్ ప్రవక్త అని కొని యాడారు. మిలాద్ ఉన్ నబీ చెడును వీడనాడి మనిషిని సన్మార్గంలో నడిపించేవి మహమ్మద్ ప్రవక్త బోధనలు అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిములు సోదరులు పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న ముస్లిము సోదరులు



పతకాలు సాధించిన ఎర్రగుంట్ల విద్యార్థులు

రాష్ట్ర స్థాయిలోఎర్రగుంట్ల విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఈ నెల 14, 15 తేదీల్లో కడపలో టెంపుల్ ఆఫ్ స్పోర్ట్స్ అకాడమీ నిర్వహించిన 1వ ఓపెన్ స్టేట్ తేక్వాండో ఛాంపియన్షిప్-2024 సీనియర్స్ విభాగంలో ఎర్రగుంట్ల జడ్‌పి హైస్కూల్ విద్యార్థులు తమ సత్తా చాటారు. వివిధ జిల్లాల నుంచి దాదాపు 300 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారని సీనియర్ మాస్టర్ వి.సుమన్ బాబు, కోచ్ జాకట దినేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎర్రగుంట్లకు చెందిన ఎస్.అమానుల్లా, డి.సుజయ్ షాలోమ్ బంగారు పతకం, ఎస్.హస్నైన్ వెండి పతకం సాధించగా, బాలికల విభాగంలో మహిత, రిషిత, బంగారు పతకం సాధించగా, ఎం.గమన వెండి పతకం, ఎం.గగన కాంస్యపతకం సాధించారని, జూనియర్స్ విభాగంలో బాల సాయి సాత్విక్, చంద్రకాంత్ బంగారు పతకం, పి.ఎస్ షామీర్ హుస్సేన్, ఎస్.యజ్ఞహిత్‌రెడ్డి వెండి పతకం సాధించగా, సబ్ జూనియర్స్ విభాగంలో పి.రెడ్డి సాకేత్, సి.వెంకట సాయి తులసినాథ్, పి.యశ్వంత్, ఎం.కార్తీక్ బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. అనంతరం కోచ్ జాకట దినేష్ మాట్లాడుతూ గ్రాండ్ మాస్టర్ ఎం.నాగూర్ మాస్టర్ ఇంటర్నేషనల్ తేక్వాండో అకాడమీలో శిక్షణ పొందుతున్నాడని, యర్రగుంట్ల జడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ఈ ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గృహోపకరణాలు వితరణ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

విభిన్నప్రతిభావంతులకు సోమవారం కుక్కర్, స్వీట్లు, పండ్లు పట్టణంలోని విజయ్ జ్యువెలర్స్ అధినేత స్వర్గీయ కొప్పరపు శివసుబ్రహ్మణ్యం నాలుగో వర్ధంతిని పురస్కరించుకొని ఆయన సతీమణి చంద్రావతి, కుమారుడు కొప్పరపు విజయ్‌కుమార్ పంపిణీ చేశారు. ముద్దనూరు రోడ్‌లోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్యవైశ్యసంఘం జిల్లా అధ్యక్షులు కొత్త రవికుమార్ విచ్చేశారు. కార్యక్రమంలో విభిన్నప్రతిభావంతుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, కొప్పరపు చంద్రావతి, కొప్పరపు విజయ్‌కుమార్, విభిన్నప్రతిభావంతుల సంఘం కార్యదర్శి ఆర్.వెంకటసుబ్బయ్య, సునీల్, కార్యవర్గ సభ్యులు గంగయ్య, బషీర్, హరిక్రిష్ణ పాల్గొన్నారు.

చేనేతలకు రుణాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి -వేంపల్లె

రాష్ట్ర ప్రభుత్వం మగ్గం వేసే కార్మికులకు నేతన్న నేస్తం పథకం ద్వారా రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని చేతి వృత్తుల ఐక్య వేదిక పార్టీ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈనెల 30న కలెక్టరేట్ కార్యాలయం వద్ద చేసే ధర్నాకు సంబంధించి సోమవారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత పరిశ్రమపై రాష్ట్రంలో 2 లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నట్లు చెప్పారు. భారీ సంఖ్యలో చేనేత కార్మికులు ధర్నా కార్యక్రమంలో పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చేతి వృత్తుల ఐక్య వేదిక పార్టీ జాతీయ నాయకులు గూడూరు రామచంద్ర, కమలాపురం అధ్యక్షుడు రమణ, కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం నాశనమే

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

యువత సరదా కోసం మత్తు పదార్థాలు, పానీయాలు అలవాటు చేసుకుంటే జీవితాలు నాశనమేనని ట్రాఫిక్ సిఐ హాజీవల్లి తెలిపారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో అధ్యక్షులు రాజు ఏర్పాటు చేసిన మాదక ద్రవ్య నిర్మూలన కోసం చేపడుతున్న అవగాహనా కార్యక్రమాలను, మత్తు నివారణ చర్యల పోస్టర్‌లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత దేశాభివృద్ధికి వెన్నెముక వారన్నారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలని ఆయన సూచించారు. మత్తు పదార్థాలపై జరిగే నష్టాల గురించి యువతకు అవగాహన కల్పిస్తున్న స్నేహిత అమృత హస్త సేవాసమితికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్,పోలీసులు పాల్గొన్నారు.

గుర్రప్పస్వామిని దర్శించుకున్న భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి నియోజకవర్గంలో సోమవారం సుడిగాలి పర్యటన చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలోకి ఆయన చేరుకోవడంతో జమ్మలమడుగు, మైలవరం, పెదముడియం మండలాల కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. అనంతరం వారితో మాట్లాడి మైలవరం మండలంలోని గుర్రప్ప స్వామి దేవస్థానానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, మల్లికార్జున, ఆలయ కమిటీ, ఎన్‌డిఎ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిఒ 115ను రద్దు చేయాలి

- ప్రిన్సిపల్ సెక్రెటరీతో మాట్లాడిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

జిఒ 115ను రద్దు చేయాలని, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని సోమవారం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ముందు నర్సులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిఒ 115ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ముందుగా చదువుకున్న నర్సింగ్ విద్యార్థులను గుర్తించాలన్నారు. జిఎన్ఎం, బీఎస్సి, ఎంఎస్సి, పీహెచ్డీ వ్యవస్థను గుర్తించాలన్నారు. కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలన్నారు. 15 ఏళ్ల నుంచి నర్సులుగా చేస్తున్న తమను ప్రభుత్వం గుర్తించకుండా కొత్తగా వచ్చిన ఎఎన్ఎంలను గుర్తించి నర్సు పోస్టులు వేయడం చాలా బాధాకరమన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గతంలో ఉన్న వారిని రెగ్యులర్ చేశారన్నారు. అదే తరహాలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడున్న వారిని కూడా క్రమబద్ధీకరించాలన్నారు.

మద్దతు తెలిపిన ఎంపీ అవినాష్‌రెడ్డి

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న నర్సులకు ఎంపీ అవినాష్‌రెడ్డి మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారి కోరికలను ఆయన అడిగి తెలుసుకుని. ప్రిన్సిపాల్ సెక్రటరీ కృష్ణబాబుతో ఫోన్‌లో మాట్లాడారు. నర్సుల సమస్యలను ఆయనకు వివరించారు. కార్యక్రమంలో ఎన్జీవో అధ్యక్షుడు జగన్నాథ్ రెడ్డి, శైలజ, హారిక, శిరీష పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి ఏళ్ల తరబడి ఎదురుచూపు

ప్రజాశక్తి - చాపాడు

మండల కేంద్రానికి సమీపంలోని నక్కలదిన్నె గ్రామానికి వెళ్లే దారిలో గుండ్ల వంకపై ఉన్న వంతెన ఎన్నో ఏళ్లుగా ఆధునికరణకు నోచుకోవడం లేదు. దీంతో వర్షాకాలంలో ఈ మార్గాన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. అధిక వర్షాలు పడిన సమయంలో నీరు తగ్గుముఖం పట్టే వరకు మండల కేంద్రంతో సంబంధాలు లేకుండా పోతున్నాయి. శాస్త్ర సాంకేతికంగా దేశం ఎంతగానో అభివృద్ధి చెందినప్పటికీ పల్లెలు మాత్రం పాత విధానంలో నడవాల్సి వస్తోంది. వర్షం వస్తే కొన్ని రోజులుగా మండల పరిధిలోని కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి ప్రజలు గ్రామాలకే పరిమితం కావాల్సిన పరిస్థితి. ప్రభుత్వాలు మారుతున్నా వాగులు, వంకలపై పురాతన పాత వంతెనలే దర్శనమిస్తున్నాయి. అవి మునకకు ఆస్కారం లేకుండా హై లెవెల్ బ్రిడ్జిల ఏర్పాటు జరగడం లేదు. వర్షానికి నీట మునిగిన సందర్భంలో ఆర్అండ్‌బి అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టడం.. తర్వాత వాటి గురించి పట్టించుకోకపోవడం పరిపాటిగా మారింది. మూడేళ్ల క్రితం వారం రోజులపాటు రాకపోకలు నిలిచిపోయిన సందర్భాలున్నాయి. ప్రస్తుతం ఉన్న వంతెన తక్కువ ఎత్తులో ఉండడం వల్ల వంకకు నీరు అధికంగా వచ్చినప్పుడు మునుగుతుంది. ప్రస్తుతం వంతెన పూర్తిగా దెబ్బతిని ఇబ్బందికరంగా మారింది. ఈ మార్గాన రాజువారిపేట, అయ్యవారిపల్లె, తిమ్మాయిపల్లి, నక్కలదిన్నె, అనంతపురం, కుచ్చుపాప, రాజు పాలెం, నరహరిపురం, వెదురూరు, రామసుబ్బమ్మ కొట్టాల గ్రామాల ప్రజలు ప్రయాణించాల్సి ఉంది. వర్షాకాలంలో ఈ మార్గాన రాకపోకలు నిలిచిపోతే ఆయా గ్రామాల ప్రజలు తాళ్లమాపురం, ప్రొద్దుటూరు మీదుగా మండల కేంద్రం చాపాడుకు రావాల్సి ఉంటుంది. అలాగే మండల పరిధిలోని గుంత చియ్యపాడు గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న వంతెన కూడా ప్రమాదపు అంచున ఉంది. మోస్తరు వర్షం వచ్చినా ఈ వంతెన నీట మునుగుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాబోయే వర్షాకాలానికైనా వంతెనలను గుర్తించి హై లెవెల్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కొత్త మెడికల్ కళాశాలలను ప్రయివేట్ వ్యక్తుల చేతికివ్వొద్దు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కొత్త మెడికల్ కళాశాలలను తేకుండా రద్దు చేయాలని ప్రభుత్వమే లేఖలు రాయడమేమిటని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ ప్రశ్నించారు. స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయంలో సోమ వారం జరిగిన విలేకరుల సమావేశంలో గుర్రం డేవిడ్‌రాజ్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీలపై 'చంద్రబాబు కత్తి! సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని రద్దు చేస్తామన్న టీడీపీ హామీ ఏమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఎన్‌డిఎ కూటమి నిర్వాకంతో ఈ ఏడాది 50 ఎంబీబీఎస్ సీట్లు పోయాయన్నారు. చంద్రబాబు గుజరాత్ మోడల్ పేరుతో ప్రయివేట్ వ్యక్తులకు మెడికల్ కాలేజి అప్పజెప్పడం కోసం ఈ ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. దీనివల్ల మెరిట్ వచ్చిన పేద విద్యార్థులకు ఏకంగా 1,750 సీట్లకు ఎసరు పెట్టారన్నారు. పులివెందుల కాలేజీకి ఎల్వోపీ ఇచ్చిన జాతీయ వైద్య కమిషన్ కాలేజీని నిర్వహించలేమని గుట్టుచప్పుడు కాకుండా లేఖ రాసిన సర్కారు ఎల్వోపీ ఇవ్వలేదని అధికారుల చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో కొత్త వైద్య కళాశాలలను ప్రయివేట్ పరం చేసి, వైద్య విద్యను వారి చేతుల్లో పెట్టాలని చూస్తున్నారన్నారు. ఇప్పటికే అందని ద్రాక్షలా మారిన వైద్య విద్యను పేద విద్యార్థులకు మరింత దూరం చేసే ప్రణాళికలు ఏమైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. ఎస్‌వి యూనివర్సిటీ విద్యార్థులకు తీవ్రమైన నష్టం జరుగుతుందని, ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయా లన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్‌రాజ్ , నాయకులు, విశ్వనాథ, రమేష్, హరి పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరణ చేయవద్దని వై సిపి పార్టీ ఎస్సీ సెల్ విభాగ రాష్ట్ర అధికార ప్రతినిధి ఉప్పలపాటి యోబు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం జమ్మలమడుగులో ఆయన మాట్లాడుతూ పులివెందులలో మెడికల్ కాలేజీ సీట్లు 50ని కేటాయిస్తే ఈ సీట్లను పెంచాల్సింది పోయి, ఉన్న సీట్లను కూడా వద్దనడం మంచి పద్ధతి కాదన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో ప్రతి పార్లమెంటు నియోజకవర్గానికి ఒక మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయాలని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఈ 17లో ప్రస్తుతం అయిదు కాలేజీలు అందుబాటులోకి వచ్చాయన్నారు. జిల్లాలో ఉన్న పులివెందల మెడికల్ కాలేజీ కూడా అందులో ఒకటన్నారు. ప్రయివేటీకరణ లేనిపక్షంలో పేదల పక్షాన ఉద్యమిస్తామని తెలిపారు.


బాలుడికి కంటి పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

53 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలంలోని ముష్టూరు పంచాయతీలో సర్పంచ్ చంద్రాయుడు ఆధ్వర్యంలో మదనపల్లె ఎల్.వి ప్రసాద్ కంటి ఆసుపత్రి అడ్మిన్ అధికారి కోటయ్య సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సచివాలయం వద్ద నిర్వహించారు. టిడిపి మాజీ మండలాధ్యక్షులు శ్రీనివా సులు, చంద్రాయుడు, టిడిపి జిల్లా బిసి సాధికార సమితి అధికార ప్రతినిధి లక్ష్మన్న ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ముష్టూరు గ్రామంలోని పేద ప్రజలకు, వృద్ధులకు, కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా కంటి వైద్యం అందించాలన్న ఆకాంక్షతో మదనపల్లె ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. ఈ కంటి వైద్య శిబిరంలో 53 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, చికిత్సలు అందించినట్లు వైద్యులు డాక్టర్ సిద్దిక్ తెలిపారు. 21 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసి శస్త్రచికిత్సలకు ఆసుపత్రికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. మరో 13 మందికి దృష్టిలోపాలను అధిగమించడానికి ప్రజలు పోషకాహారమైన పాలు, పండ్లు, ఆకుకూరలు తరచూ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీనివాసులు, చంద్రాయుడు, లక్ష్మన్న, కృష్ణయ్య, ఎల్.వి ప్రసాద్ కంటి ఆస్పత్రి డాక్టర్ సిద్దిక్, డాక్టర్ శ్రావణి, సోమశేఖర్, చెన్నకేశవులు, ఎఫ్ఎస్ఒ కొమ్ము వెంకటేష్, విజన్ టెక్నీషియన్ శ్రావణి పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిన మహేష్

ప్రజాశక్తి-నందలూరు



మండలంలోని నల్లగుట్లపల్లి పంచాయతీ బి.రాచపల్లి చెందిన పోతూరి వెంకటరమణ, గంగాదేవిల కుమారుడు మహేష్‌యాదవ్ మెడిసిన్‌లో సీటు సాధించి పేద విద్యార్థులకు ఆదర్శంగా నిలిచాడని గ్రామస్తులు పేర్కొన్నారు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోవడంతో తల్లి జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలు వెళ్లడంతో తన అమ్మమ్మ దగ్గర ఉంటూ చక్కగా చదువుకున్నాడని అన్నారు. నీట్ పరీక్షల్లో 637 మార్కులు తెచ్చి రాష్ట్రస్థాయిలో 881 ర్యాంకు సాధించి ఒంగోలు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు సాధించినట్లు మహేష్ పేర్కొన్నారు. మహేష్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించడం పట్ల మండలంలోని ప్రజలు అభినందించారు.


రాజా కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైసిపి నాయకులు

ఉప సర్పంచ్ మృతి బాధాకరం : 'కొరముట్ల'

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

మండలంలోని ఎస్.కొత్తపల్లి ఉపసర్పంచ్ యామల రాజా మృతి చెందడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి పేర్కొన్నారు. గత రెండు రోజుల క్రితం రాజా గుండె పోటుతో అకస్మాత్తుగా మృతి చెందడం పట్ల వారు విచారం వ్యక్తం చేశారు. కష్టకాలంలో కూడా పార్టీకి అండగా ఉంటూ గ్రామ సమస్యలను తమ సమస్యలుగా భావించి అందరికీ సహాయపడుతూ ఉండేవారని అన్నారు. కుటుంబ సభ్యులు ఎవ్వరు అధైర్యపడవద్దని తాము ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని, అన్నివిధాలా ఆదుకుంటామని కుటుంబసభ్యులకు ధైర్యాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచులు సుజాత, రామకృష్ణ, హరి కృష్ణరెడ్డి, ఎంపిటిసి షఫీ, ప్రతాప్‌రెడ్డి, వెంకట రెడ్డి, రాజారెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఝరికోన ప్రాజెక్ట్ కార్మికులతో మాట్లాడుతున్న ఎఐటియుసి నాయకులు

పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలి

ప్రజాశక్తి-పీలేరు

కెవిపల్లి మండలంలోని ఝరికోన ప్రాజెక్ట్ కార్మికుల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని ఏఐటియుసి పీలేరు నియోజకవర్గ ఉపాధ్యక్షులు టివిఎల్.వెంకటేష్ పేర్కొన్నారు. సోమవారం ఆయన తిమ్మాపురం గ్రామంలో నార మాకులమిట్టలో కార్మికులతో మాట్లాడారు. ఈ ప్రాజెక్టులో పనిచేస్తున్న సుమారు 49 మంది కార్మికులకు దాదాపు పది నెలలుగా ఝరికోన ప్రాజెక్టులో పని చేస్తున్న కార్మికులకు జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్మికులకు ప్రభుత్వం సక్రమంగా జీతాలు ఇవ్వడం లేదని, వారికి వచ్చే అరకొర జీతాలు కూడా దానికి రాక కుటుంబ అవసరాలు, పిల్లల చదువులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్మికులు రేయనక పగలనక కష్టపడుతూ ప్రజలకు నీటి సమస్య రాకుండా గొడ్డు చాకిరీ చేస్తున్నారని అన్నారు. కార్మికులకు పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు ఆనంద బాబు, నాగరాజ, ఎర్రయ్య, శివ భరత్ రెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

BEFORE THE CHAIRMAN : MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL (HONBLE Ist ADDIL., DISTRICT JUDGE AT :NALGONDA
O.P. No. 264 OF 2022

Between :
Vanguri Karunakar ....Claimant
AND
Sri Pathan Inthiyaz Khan & another ....Respondents

NOTICE

To
R-2) Sri Pathan Iliyaz Khan S/o Jaffar Khan aged Major occu : Business R/o H.No. 15-120, Karimiya Masid backside, Kothaplly, Rayacoti, YSR Kadapa (Annamaya) District of Andhra Pradesh State of India. (Owner of the Lorry bearing No. A.P-04-TW-0816)
Please take notice that the above named Claimant had filed a above claim petition for grant of compensation against you and Insurance Company and also driver of crime vehicle Lorry. The above Claim petition is posted on 25-09-2024 for your appearance. So you may appear in Person or through your Advocate on 25-09-2024 at 10-30 A.M., before this Hon'ble Court. In case of your absence the matter will be decided exparte.
(PUBLISHED AS PER THE ORDERS OF THE HONBLE COURT)
AKKINEPALLY NARENDER RAO
THUMMALA VENKAT REDDY
ADVOCATES : NALGONDA.
Cell No. 94401 17194


మెడికల్‌షాపును ప్రారంభిస్తున్న రూపానందరెడ్డి,శ్రీధర్‌లు

నాణ్యమైన మందులను అందించాలి :'ముక్కా'

ప్రజాశక్తి-పుల్లంపేట

మెడికల్ షాపుకు వచ్చే వారికి నాణ్యమైన మందులను అందివ్వాలని రైల్వేకోడూరు టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. ఓబులవారిపల్లి మండల పరిధిలోని చిన్న ఓరంపాడు క్రాస్ రోడ్‌లో సోమవారం గొబ్బిళ్ళ చంగల్‌రాయుడు, సాయిచందు ఆహ్వానం మేరకు విఎస్‌పి మెడికల్ షాప్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కొడుకు సాయివికాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో మెడికల్‌షాపు ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. తక్కువ ధరకే మందులు లభిస్తాయని ఈ చక్కటి అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్‌డిఎ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నగలను పరిశీలిస్తున్న తనిఖీ బృందం

వెంకటరమణస్వామి ఆభరణాలు తనిఖీ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని కోసవారిపల్లిలో వెలిసిన శ్రీ ప్రసన్న వెంకటర మణ స్వామి ఆలయంలో సోమవారం టిడిపి గోల్డ్ వెరిఫికేషన్ అధికారుల బృందం వెంకటరమణస్వామి ఆభర ణాలను తనిఖీ చేసింది. ప్రతి ఏడాది చేపట్టే సాధారణ తనిఖీలు భాగంగా స్వామివారి నగలను తనిఖీ చేసినట్లు ఎఇఒ గోపీ నాథ్, సూపర్ ఏంటెడ్ మునిబాలకుమార్, ముని చంగల్‌రాయుడులు తెలి పారు. అన్ని ఆభరణాలు సవ్యంగా ఉన్నట్టు తనిఖీ బృంద సభ్యులు తెలిపారు. ఆలయ డిప్యూటీ ఇఒ వరలక్ష్మి, టిఐ దిశాంత్ కుమార్, సిబ్బంది నగేష్‌లు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్ : ఎంఆర్‌పిఎస్ దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఎస్సీ కాలనీలో సోమవారం ఇటీవల ఢిల్లీ ఎయిమ్స్‌లో మరణించిన సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఇఎఫ్ జిల్లా అధ్యక్షులు పిచ్చికె బాబు మాట్లాడుతూ చెన్నైలో స్థిరపడిన తెలుగు కుటుంబంలో జన్మించిన సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచే తాను నమ్మిన సిద్ధాంతం కోసం, పేద ప్రజల అభ్యున్నతికి నిరంతరం పోరాటాలు చేశారన్నారు. దేశంలోనే ప్రముఖ రాజకీయ నాయకుడిగా, సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఆ పార్టీ పార్లమెంట్ వర్గపు నాయకుడిగా విశిష్ట గుర్తింపు పొందిన కమ్యూనిస్టు యోధుడని కొనియాడారు. ఆయన మరణం పట్ల ఎంఆర్‌పిఎస్, దాని అనుబంధ సంఘాల తరఫున తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఇఎఫ్ సీనియర్ నాయకులు ఆర్.రామన్న, నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.చిన్నయ్య, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు మేకల ఆంజనేయులు, ఎంఇఎఫ్ జిల్లా జాయింట్ సెక్రటరీ కె.కొండయ్య, నియోజకవర్గ అధ్యక్షులు కె.బాల ఓబయ్య, ప్రధాన కార్యదర్శి ఎన్.సి.ఓబులేసు, వై.చంద్రకుమార్, రాం పుల్లయ్య, ప్రతాప్ పాల్గొన్నారు.

నేడు అన్న క్యాంటీన్ ప్రారంభం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణ పరిధిలోని నాలుగు రోడ్ల కూడలి దగ్గర అన్న క్యాంటీన్‌ను బుధవారం శాసన మండలి సభ్యుడు భూమిరెడ్డి రాం గోపాల్‌రెడ్డి ప్రారంభిస్తున్నట్లు మున్సి పల్ కమిషనర్ రాముడు ఒక ప్రకటనలో తెలి పారు.

క్రైం కార్నర్


బాధితుడు యేసురాజును విచారిస్తున్న డిఎస్‌పి సుధాకర్

సాక్షులను విచారించిన డిఎస్‌పి

ప్రజాశక్తి-కలికిరి

ఎస్‌సి,ఎస్‌టి కేసు నమోదవడంతో డిఎస్‌పి సుధాకర్ ఆధ్వర్యంలో సోమవారం విచారణను చేపట్టారు. పోలీసుల కథనం మేరకు.. కలికిరి టౌన్, మిషన్ కాంపౌండు వద్ద నివాసమున్న గడ్డం ఏసురాజు అను వ్యక్తిని కలికిరికి చెందిన కొంతమంది వ్యక్తులు శనివారం ఆయన పైన దాడిచేసి, కులం పేరుతో దూషించినట్లు కలికిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.సంబంధిత వ్యక్తులపై ఆదివారం ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. సోమవారం రాయచోటి ఇన్‌ఛార్జి డిఎస్‌పి సుధాకర్ కలికిరి వచ్చి దర్యాప్తులో బాగంగా సాక్షులను విచారణ చేసినట్లు వారు తెలిపారు.

రైలు ప్రమాదంలో తెగిపడిన యువకుడి చేయి

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు రైల్వే కేంద్రంలో సోమవారం రైలు కింద పడి యువకుడి చేయి తెగిపడిపోయిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుంత కల్లుకు చెందిన కురుబ ధనుష్ పుత్తూరు సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో బిటెక్ మూడవ సంవ త్సరం చదువుతున్నాడు. సోమవారం కాలేజీకి వెళ్లేందుకు గుంతకలు నుంచి ఎక్స్‌ప్రెస్ రైలులో పుత్తూరుకు వెళుతూ ప్రమాదవశాత్తు నందలూరులో అదే రైలు కిందపడి చెయ్యి పూర్తిగా తెగిపడిపోయింది. వెంటనే స్థానిక ఆర్‌పిఎఫ్, జిఆర్‌పి సిబ్బంది స్పందించి క్షతగాత్రుడిని రాజంపేట ప్రభుత్వ ఆస్ప త్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స కోసం 108 వాహనాన్ని సంప్రదించగా గంట ఆలస్యం అవు తుందని తెలపడంతో క్షతగాత్రున్ని ఆటోలో తరలించారు.


గాయపడిన యువకుడిని ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు